పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# ‘ప్రైవేటు’ దోపిడీ



నోట్ పుస్తకాలు, యూనిఫాం వారి దగ్గరే కొనాలని హుకుం జారీ

## పట్టించుకోని అధికారులు

**నూజివీడు, జూన్07 ప్రభాతవార్త :**

**ప్రైవేట్ స్కూల్స్ పిచ్చ పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. లాభార్జన వీరి లక్ష్యం, వీధి కొక హై స్కూలు, సందుకొక ప్రైమరీ పాఠశాల 3 పువ్వులు, 6 కాయలుగా వీరి వ్యాపారం కొనసాగుతుంది. మండల ,డివిజన్, జిల్లా స్థాయి విద్యాశాఖ అధికారులకు ముడుపులు చెల్లించి , ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు చల్లి నిర్భయంగా ప్రజల నుంచి దోపిడీ చేస్తారు. వీరిని లెక్కలు అడిగే వారే కరువయ్యారు.**

నూజివీడు రూరల్, పట్టణం లో 41 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ముసునూరు మండలం 06, చాట్రాయి మండలం 06 , లింగపాలెం మండలంలో 11 , చింతలపూడి పట్టణం, మండలంలో 27, ఆగిరిపల్లి మండలం 15 ప్రైవేట్ స్కూల్స్ ఉన్నాయి. వీటిలో 54 ఉన్నత పాఠశాలలు , 31 ప్రాథమికోన్నత, 21 ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్నాయి . అధిక ఫీజుల భారం ట్యూషన్ ఫీజులు, బస్సు ఫీజులు, బుక్స్, యూనిఫాం, డిజిటల్ ఫీజులు వంటి ఖర్చులు చాలా ఎక్కువగా వసూలు చేస్తున్నారు.రోజువారీ కూలి చేసుకునే కుటుంబాలు అప్పులు చేసి పిల్లలను చదివించాల్సి వస్తోంది.ఇంగ్లీష్ మీడియం ఒత్తిడి , చాలా ప్రైవేట్ స్కూల్స్ పూర్తిగా ఇంగ్లీష్ మీడియంలో బోధిస్తాయి.
గ్రామీణ ప్రాంతాల పిల్లలు మొదట్లో అర్థం చేసుకోవడంలో ఇబ్బంది పడుతున్నారు.దీనివల్ల భయం, ఆత్మవిశ్వాసం తగ్గడం జరుగుతోంది. సామాజిక అసమానతధనిక పిల్లలు, పేద పిల్లల మధ్య తేడా స్పష్టంగా కనిపిస్తుంది. ఖరీదైన వస్తువులు కొనలేక కొంతమంది విద్యార్థులు మానసికంగా కృంగిపోతున్నారు. అదనపు కోచింగ్ ఒత్తిడి మార్కుల కోసం ప్రత్యేక కోచింగ్, హోమ్‌వర్క్ ఎక్కువగా ఇస్తారు. పేద కుటుంబాలు ట్యూషన్లు పెట్టలేక పిల్లలు వెనుకబడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రభావం చూపుతుంది. మంచి విద్య కోసం ప్రైవేట్ స్కూల్స్ వైపు ఎక్కువ మంది వెళ్లడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. దీని వల్ల ప్రభుత్వ స్కూల్స్ అభివృద్ధి మందగిస్తోంది. రవాణా సమస్యలుగ్రామాల నుంచి దూరంగా ఉన్న ప్రైవేట్ స్కూల్స్‌కి వెళ్లడానికి ఎక్కువ సమయం, డబ్బు ఖర్చవుతోంది.చిన్న పిల్లలు తెల్లవారుజామునే బయలుదేరాల్సి వస్తోంది.చదువు మధ్యలో మానేయడం,ఫీజులు చెల్లించలేక కొంతమంది విద్యార్థులు మధ్యలోనే చదువు ఆపేస్తున్నారు.ముఖ్యంగా ఇంటర్ , హైస్కూల్ స్థాయిలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది.మానసిక ఒత్తిడిమార్కులు, ర్యాంకులు, ఫీజుల ఒత్తిడి వల్ల పిల్లల్లో టెన్షన్ పెరుగుతోంది.కొంతమంది విద్యార్థులు డిప్రెషన్‌కు కూడా గురవుతున్నారు. కొన్ని పాఠశాలల్లో క్రీడా స్థలాలు కూడా లేవు విద్యార్థులు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలంటే క్రీడలు కూడా నేర్చుకోవాలి. కానీ చాలా ప్రైవేట్ స్కూల్స్లో క్రీడాస్థలాలు లేవు. కనీసం 11.5 సెంట్లు నుంచి 30 సెంట్లు వరకు క్రీడా స్థలాలు ఉండాలి. ఎల్కేజీ విద్యార్థికి కూడా లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న సంఘటనలు కనిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కూడా పుస్తకాలతో కలిపి రూ . 50 వేల నుంచి రూ . లక్ష వరకు వసూలు చేస్తున్నారు. ప్రైవేట్ స్కూల్స్ పై సరైన నియంత్రణ చేసి పేద వారికి కూడా నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఇంగ్లీష్ మీడియం సమర్థవంతంగా అమలు చేసి, ఉపాధ్యాయుల కొరత లేకుండా సౌకర్యాలు కూడా మెరుగుపరిస్తే విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావచ్చు. పదో తరగతి ఫలితాలలో ఉన్నతమైన ర్యాంకులు సాధించటానికి ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం అనేక అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పదో తరగతి పరీక్ష కేంద్రాలలో ఇన్విజిలేటర్లను, పరీక్ష కేంద్ర నిర్వాహకులను ప్రలోభాలకు గురిచేసి వారి స్కూల్స్ విద్యార్థులకే ప్రత్యేక ఏర్పాట్లు చేసి మాస్ కాపీయింగ్ కూడా పాల్పడేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఫలితాలు వచ్చిన తర్వాత స్టేట్, జిల్లా ర్యాంకులతో సంబరాలు చేసుకుంటున్నారు. ఆ ర్యాంకులతో పెద్దపెద్ద బోర్డులు ఏర్పాటు చేసి భారీ స్థాయిలో అడ్మిషన్లు రాబట్టుకుంటున్నారు . అందులో చేరిన తర్వాత నెల నెల బాదుడే పేద ,మధ్యతరగతి కుటుంబాల వారు కూడా తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలని ప్రైవేట్ స్కూల్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తే ప్రైవేట్ స్కూల్ కు వెళ్లాల్సిన అవసరం ఉండదని పలువురు విద్యావేత్తలు అభిప్రాయ వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని పలువురు మేధావులు కోరుతున్నారు.
నూజివీడు డి.వై.ఇ.వో డాక్టర్. పి.ఎస్. సుధాకర్ వివరణ:- నూజివీడు డివైఈవో మాట్లాడుతూ తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే, ప్రభుత్వ నిబంధనల కు వ్యతిరేకంగా వ్యవహరించే పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.






# నిర్వాసితులకు ‘దారేది’..

## అధ్వానంగా పి అంకంపాలెం-చల్లవారిగూడెం రహదారి



**జీలుగుమిల్లి, జూన్-07, (ప్రభాతవార్త)** రాష్ట్ర ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టు కోసం సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసితుల పట్ల ప్రభుత్వాలు ఇంకా చిన్న చూపు చూస్తున్నట్లు అనిపిస్తుంది. ఒక ప్రక్క రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం గుంతల రోడ్లను కూడా తారు రోడ్లగా మారుస్తుంటే.., అన్నీ ఉన్న అల్లుడు నోట్లో శని లాగా నిర్వాసిత కాలనీలకు అన్ని సౌకర్యాలు ఉన్నా ఆయా గ్రామాలను అనుసంధానించే ప్రధాన రహదారులు అభివృద్ధి ఇంకను చేపట్టకపోవడంతో నిర్వాసితులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి మండలంలోని పి అంకంపాలెం- చల్లవారిగూడెం మధ్య సుమారు 05 కి. మీ మధ్య దూరం ఉంది. ఒకప్పుడు పి అంకంపాలెం-చల్ల వారి గూడెం మధ్య ఉన్న ఈ రహదారి జన సంచారం లేక నిర్మానుషంగా ఉండేది. ఇదే మార్గంలో ప్రభుత్వం భూసేకరణ చేసి గత ఐదేళ్ల క్రితం నిర్వాసిత గ్రామాలైన కొరుటూరు (180 కుటుంబాలు), గాజుల గొంది (120 కుటుంబాలు), సిరివాక (80 కుటుంబాలు) లతో పాటు అతిపెద్ద నిర్వాసిత గ్రామమైన చల్లవారిగూడెం కాలనీలో కొయిదా, రేపాక గొమ్ము తదితర గ్రామాలను నిర్మించింది. ఈ క్రమంలో పెరిగిన జనాభా మండల కేంద్రం జీలుగుమిల్లి రావాలన్న, లేదా తాడువాయి ప్రధాన రహదారికి రావాలన్న దగ్గర మార్గంగా ఉంది. వర్షాకాలం బురద, ఎండాకాలం దుమ్ము: నిర్వాసితులను కలిపే ఈ రహదారి వర్షాకాలం వస్తే ప్రయాణం నరక ప్రాయమే!ఈ దారిలో స్కూలు బస్సు కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. ఒక ప్రక్క మురికి నీటితో నిండిన గోతులు, బురద మధ్య, వేసవి వస్తే రేగుతున్న దుమ్ము మధ్య నిర్వాసితులు ప్రయాణం సాగిస్తున్నారు. ఇప్పటికే భూ సమస్యలతో సతమతం అవుతున్న తమకు ఈ రహదారిని ప్రభుత్వం నేటికీ అభివృద్ధి చేయకపోవడంపై నిర్వాసితులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే గమ్యానికి చేరడం కూడా కష్టమే! ఈ రహదారి అభివృద్ధి చేస్తే అంకంపాలెం దగ్గర జీలుగుమిల్లి-కొవ్వూరు జాతీయ రహదారికి-తాడువాయి వద్ద తల్లాడ-దేవరపల్లి జాతీయ రహదారికి నిర్వాసితులు దగ్గర అవడమే కాకుండా వేగంగా ప్రధాన రహదారులకు చేరుకుంటారు. ఇప్పటివరకు నిర్మానుష్యంగా ఉన్న ఈ రహదారిని నిర్మిస్తే వాహనాల రాకపోకలతో సందడి వాతావరణం ఏర్పడడమే కాకుండా, రైతుల పండించిన పంటలను మార్కెట్ కు వేగంగా తరలించుకోవచ్చు. ఎంతో ప్రాముఖ్యం గల ఈ రహదారి అభివృద్ధి చేసి తమ కలను సాకారం చేయాలని నిర్వాసితులు కోరుతున్నాను.

# ఆరోగ్యకర జీవితానికి యోగా అవసరం

- వృద్ధాప్యంలో వచ్చే సమస్యలకు యోగా ద్వారా పరిష్కారం
- “ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా” థీమ్ తో కార్యక్రమాలు
- ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి
- ఈనెల 21న కోటి మందితో యోగాంధ్ర కార్యక్రమం
- తణుకులో యోగాసనాలపై అవగాహన కల్పించిన ఎమ్మెల్యే రాధాకృష్ణ




**తణుకు, జూన్ 7 (ప్రభాత వార్త):** వృద్ధాప్యంలో ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉంచేందుకు యోగాను ప్రతి ఒక్కరు తమ జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. వయసు పెరిగే కొద్దీ వచ్చే శారీరక, మానసిక సమస్యలను తగ్గించేందుకు యోగాసనాలు ఎంతో ఉపకరిస్తాయని అన్నారు. అంతర్జాతీయ యోగా వారోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం తణుకు రెండో వార్డు యోగ పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాధాకృష్ణ పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగ” అనే థీమ్ తో ఈ ఏడాది యోగ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని వారం రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాల్లో యోగాపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకోవడం ద్వారా వృద్ధాప్యంలో వచ్చే సమస్యలు అధిగమించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యోగాంధ్ర కార్యక్రమానికి పెద్ద పీట వేసారని గుర్తు చేశారు. ప్రతి ఏటా యోగాంధ్ర కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వారం రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా యోగా కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించి ప్రజలను భాగస్వామ్యం చేసే విధంగా వారి ఆరోగ్యాన్ని పెంపొందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. తణుకు నియోజకవర్గంలో వివిధ స్వచ్ఛంద సంస్థలతో పాటు యోగ గురువులు, సంస్థలు భాగస్వామ్యం అయ్యేవిధంగా రాబోయే పది రోజులపాటు ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈనెల 21న రాష్ట్రవ్యాప్తంగా కోటి మందితో యోగా కార్యక్రమం చేయాలని లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు.ాష్ట్రంలో 10 లక్షల మంది యోగ శిక్షకులను తయారు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఇప్పటికే రెండున్నర లక్షల మంది సర్టిఫైడ్ శిక్షకులు ఉన్నారని చెప్పారు. 21వ తేదీన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేవారు కచ్చితంగా యోగాంధ్ర పోర్టల్ లో తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సలహాదారు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు సూచనలు మేరకు దాదాపు 150 వీడియోలు వాట్సప్ ద్వారా ఫోన్లకు పంపించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. 81424 04888 నెంబర్ కు హాయ్ అని మెసేజ్ పంపడం ద్వారా వీడియోలు పొందవచ్చని ఎమ్మెల్యే రాధాకృష్ణ సూచించారు. ఈ కార్యక్రమంలో యోగ శిక్షకులతో పాటు ఔత్సాహికులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడే సీఎం సిద్ధాంతం రాక

## సీఎం సభను విజయవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు



**వాసవి పెనుగొండ జూన్ 7 (ప్రభాత వార్త)** గోదావరి తీరం పసుపు రంగు పూసుకుంది రాష్ట్ర అధినేత ముఖ్యమంత్రి రాక కోసం పెనుగొండ మండలం సర్వం సిద్ధమైంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన “మీ భూమి -- మీ హక్కు” కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం జూన్ 8వ తేదీ సోమవారం పెనుగొండ మండలం, సిద్ధాంతంలో నిర్వహించనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్లను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మరియు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర ప్రధాన భూపరిపాలన కమిషనర్ మరియు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు తదితరులు పరిశీలించారు. సిద్ధాంతంలో ఏర్పాటు చేస్తున్న సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతం, క్యాడర్ మీటింగ్ వేదిక, రైతుల సమావేశ ప్రదేశాలు తదితర ప్రాంతాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ జూన్ 8వ తేదీ ఉదయం 11 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి సభా ప్రాంగణానికి చేరుకుంటారని తెలిపారు. సభకు ముందు ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శన (అగ్రికల్చర్ స్టాల్స్)ను ముఖ్యమంత్రి పరిశీలిస్తారని, అనంతరం సభా వేదికపై రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తారని పేర్కొన్నారు. వంశపారంపర్యంగా వస్తున్న భూములకు రాజముద్రలతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు ముఖ్యమంత్రి స్వయంగా పంపిణీ చేస్తారని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి నేరుగా రైతుల పొలాలకు వెళ్లి రైతులతో ముఖాముఖి నిర్వహించి, వారు ఎదుర్కొంటున్న సాగు సమస్యలు, ఇబ్బందులపై ఆరా తీస్తారని చెప్పారు. అలాగే నియోజకవర్గ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకుంటారని తెలిపారు. సిద్ధాంతం గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల రైతులు, పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన భూపరిపాలన కమిషనర్ తో రైతులకు పంపిణీ చేయనున్న పట్టాదారు పాస్ పుస్తకాల అంశంపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సమయం తక్కువగా ఉన్నందున అన్ని పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఏర్పాట్లలో ఎటువంటి లోటుపాట్లు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేసే రైతులకు ముందస్తుగా సమాచారం అందించి, వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. సభకు వచ్చే రైతులు, ప్రజలకు తాగునీరు, వైద్య సేవలు, శానిటేషన్ వంటి మౌలిక వసతులు సమృద్ధిగా ఏర్పాటు చేయాలని సూచించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, సభా ప్రాంగణంలో తాగునీటి కొరత లేకుండా చూడాలని, వైద్య బృందాలు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సభకు హాజరయ్యే రైతులకు అల్పాహారం, భోజన ఏర్పాట్లు నాణ్యతతో నిర్వహించాలని తెలిపారు. పార్కింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు ప్రత్యేక మార్గదర్శకాలు అమలు చేయాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతానికి ప్రతి శాఖ అధికారి బాధ్యతాయుతంగా పనిచేసి సమన్వయంతో కృషి చేయాలని అధికారులు

### ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు జూన్ 8 తేదీన పశ్చిమ గోదావరి జిల్లా సిద్ధాంతం పర్యటన వివరాలు.

ఉదయం 10:25 గంటలకు గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి నివాసం నుండి హెలికాప్టర్ ద్వారా బయలుదేరుతారు.
ఉదయం 11:00 గంటలకు పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు ఇతరులు స్వాగతం పలుకుతారు.
ఉదయం 11:15 గంటలకు గ్రామ సభ వేదికకు చేరుకొని పట్టాదార్ పాస్‌బుక్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని స్టాళ్లను సందర్శిస్తారు.
మధ్యాహ్నం 1:20 గంటల నుండి 2:25 గంటల వరకు సమయం రిజర్వ్‌గా ఉంచబడింది.
మధ్యాహ్నం 2:30 గంటలకు సిద్ధాంతం గ్రామంలోని వ్యవసాయ క్షేత్రానికి చేరుకొని రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహిస్తారు.
మధ్యాహ్నం 3:15 గంటలకు కేడర్ సమావేశ వేదికకు చేరుకొని సాయంత్రం 4:45 గంటల వరకు పార్టీ కేడర్ సమావేశంలో పాల్గొంటారు.
అనంతరం సాయంత్రం 5:00 గంటలకు సిద్ధాంతం హెలిప్యాడ్ నుండి హెలికాప్టర్ ద్వారా బయలుదేరుతారు.

# సిద్ధాంతంలో కలుద్దాం సత్యనారాయణ..

## ముఖ్యమంత్రి ట్వీట్. - 96 ఏళ్ల వృద్ధుడి చిరకాల కోరికకు నెరవేర్పు.. నేడు చంద్రబాబుతో భేటీ...



**వాసవి పెనుగొండ జూన్ 7 ( ప్రభాత వార్త)** సోషల్ మీడియాలో వైరల్ అయిన 96 ఏళ్ల వృద్ధుడు సానబోయిన సత్యనారాయణ కోరికకు ఎట్టకేలకు నెరవేర్పు దక్కనుంది. పెనుగొండ మండలం, రామన్నపాలెం శివారు కామదేనువు లంకకు చెందిన సత్యనారాయణ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని ఒక్కసారి కలవాలని తన మనసులోని కోరికను వ్యక్తం చేయగా, ఆ విషయం సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయింది. ఈ విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి చేరడంతో ఆయన స్పందించి వృద్ధుడి కోరికను సిద్ధాంతంలో సోమవారం జరిగే సభలో నెరవేరుస్తానని సోషల్ మీడియా ద్వారా సమాచారం అందించారు. దీంతో సత్యనారాయణ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. తన అభిమాన నాయకుడిని ప్రత్యక్షంగా కలిసే అవకాశం రావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వృద్ధాప్యంలోనూ చంద్రబాబు నాయుడిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్న ఆయన కోరికకు స్పందించిన ముఖ్యమంత్రి చర్యపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 8వ తేదీ సోమవారం సిద్ధాంతం గ్రామంలో జరిగే కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరుకానుండగా, అదే వేదికపై సానబోయిన సత్యనారాయణను కలిసే అవకాశం కల్పించనున్నారు. దీంతో 96 ఏళ్ల వృద్ధుడి చిరకాల స్వప్నం నెరవేరనుంది.




# నిజాయితీ నిబద్ధతకు నూరేళ్ల వసంతం

- విలువలు కోసం జీవించిన వ్యక్తి అడ్వకేట్ వైవిఆర్
- న్యాయమూర్తుల అభిభాషణ
- కొలువుతీరిన 12 మంది హైకోర్టు న్యాయమూర్తులు

**నరసాపురం జూన్ 7 ప్రభాత వార్త**

న్యాయవాదిగా మూడు దశాబ్దాల పాటు పనిచేసిన యామర్తి వెంకటేశ్వరరావు ( వై వి ఆర్ ) న్యాయవాద వృత్తిలో గల విలువల కోసం క్రమశిక్షణతో తన క్లైంట్ యొక్క ప్రయోజనాన్ని కాపాడడం కోసం విలువలతో పని చేసిన వ్యక్తి అని ఆయనను న్యాయవాదులు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రామచంద్ర రావు అన్నారు. ఆదివారం స్థానిక తెలగా కళ్యాణ మండపంలో జరిగిన వైవిఆర్ శత జయంతి వేడుకలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సభకు జస్టిస్ గ్రంధి భవాని ప్రసాద్ అధ్యక్షత వహించారు. వై వి ఆర్ కుమారుడు యామర్తి చంద్రశేఖర్ ఏర్పాటుచేసిన ఈ సభలో న్యాయమూర్తులు కొలువుతీరి న్యాయవ్యవస్థ పటిష్ఠత గౌరవం అందుకు న్యాయవాదులు పాటించవలసిన నిబద్ధతను వివరించారు. వై వి ఆర్ జీవనయానం కఠినమైన క్రమశిక్షణతో న్యాయ సూత్రాలను పాటిస్తూ ముందుకు సాగిందని జస్టిస్ రామచంద్ర రావు అన్నారు. వై వి ఆర్ న్యాయ రంగంలో కీర్తి ప్రతిష్టలు పొందడానికి కారణం ఆయన ఎంచుకున్న నిబద్ధతేనని చాటారు. జస్టిస్ రామచంద్రరావు తొలుత జిల్లా న్యాయ వ్యవస్థ న్యాయవాదుల బాధ్యత అంశంపై ప్రత్యేకంగా మాట్లాడారు. సివిల్ క్రిమినల్ కేసుల్లో న్యాయవాదులు పాటించాల్సిన మార్గదర్శకాలను వివరించారు.
ఈ సందర్భంగా పలు కేసులను కోట్ చేస్తూ సమకాలీన వ్యవస్థలో న్యాయ వ్యవస్థ అందిస్తున్న ఉచిత న్యాయ సహాయం సీనియర్ సిటిజన్స్ కు గల అవకాశాలను ఆయన సమగ్రంగా వివరించారు. హైకోర్టు న్యాయమూర్తులు ఎం నాగేశ్వరరావు సుబ్బారెడ్డి అభిషేక్ రెడ్డి డి.ఎస్ వర్మ సి వై సోమయాజులు ఆకుల వెంకట శేష సాయి చీమలపాటి జీవన్ రెడ్డి అనుపమ చక్రవర్తి సీనియర్ న్యాయవాది జీవీకే రామారావు వైవిఆర్ కుమారుడు వై చంద్రశేఖర్ గ్రంధి భవానీ ప్రసాద్ కే శ్రీనివాస్ చక్రవర్తి తదితరులు మాట్లాడారు. కవి రచయిత పొన్నపల్లి శ్రీరామారావు అక్షరాంజలిని వివరించారు. న్యాయమూర్తులను ఈ సందర్భంగా చంద్రశేఖర్ పండితే శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందించారు. గోదావరి జిల్లాల నుండి పలువురు న్యాయమూర్తులు న్యాయవాదులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. న్యాయవాదులు నిడుమోలు జ్ఞానానంద నిడుమోలు చక్రవర్తి పోలిశెట్టి సూరిబాబు సహకరించారు.







## పాత బట్టలివ్వండి - కొత్తవి తీసుకెళ్లండి : బొండా



**భీమవరం జూన్ 7 ప్రభాతవార్త** సమాజంలో పేదవారిని ఆదుకోవడం సమాజ నైతిక బాధ్యత అని లయన్స్ క్లబ్ అధ్యక్షులు బొండా రాంబాబు, ఫెమినా క్లబ్ అధ్యక్షురాలు ఐశ్వర్య, జోన్ చైర్ పర్సన్ నడింపల్లి మహేష్, కోట్ల నాని అన్నారు. డామేజ్ లేని పాత మంచి బట్టలు అనే వినూత్న కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ చేపట్టిందన్నారు. లయన్స్ పేదవారికి ఉచితంగా బట్టలు అందించాలనే ఉద్దేశంతో భీమవరం ఇభ స్టోర్ వారితో సంప్రదించగా వారు ముందుకు వచ్చారని అన్నారు. ఏవరైనా డామేజ్ లేని ఒక పాత జత తెచ్చి వారి వద్ద ఏమైనా కొన్నచో వారికి ఎక్స్ ట్రా గా 10 శాతం డిస్కౌంట్ అందిస్తున్నారని అన్నారు. ఈ అవకాశం అందరూ ఉపయోగించుకొని పేదవారికి ఉచితంగా డామేజ్ లేని పాత జతలు ఇవ్వడానికి సహకరించాలని ఇభా స్టోర్ యాజయమాన్యం రాధాకృష్ణ, నాని అన్నారు. టంబుల్ డ్రై లాండ్రీ ఉ డ్రైలినర్స్ వారు శుభ్రం గా వాష్ చేసి ఇస్తాము అని సిహెచ్. అనురాధ అన్నారు ఈ అవకాశం ఈనెల 6న ప్రారంభమై కొద్ది రోజులు మాత్రమే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గుప్త, భట్టిప్రోలు శ్రీను,కురిశెట్టి గోపాలకృష్ణ, క్లబ్ సభ్యులు కనగర్ల రామకృష్ణ, డా గోపీనాథ్, కనగర్ల నాగమణి, పాల్గున్నారు.

## శేషాచల కొండపై అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు శ్రీకారం

**జూన్ 21 వరకు ప్రతిరోజూ యోగా శిక్షణ కార్యక్రమాలు**

**ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యం: ఈవో వి. త్రినాధరావు**



**ద్వారకాతిరుమల, జూన్ 7 ప్రభాతవార్త** : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు, దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఆదివారం,ద్వారకాతిరుమల శేషాచల కొండపై ఉన్న పద్మాలయ ప్రాంగణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. సమాజంలో శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) వి. త్రినాధరావు తెలిపారు.జూన్ 7 నుంచి జూన్ 21 వరకు ప్రతిరోజూ ఉదయం 7.30 గంటల నుంచి 8.30 గంటల వరకు యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. తొలి రోజు యోగా కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొని యోగాభ్యాసం చేశారు.ఈ సందర్భంగా ఈవో వి. త్రినాధరావు మాట్లాడుతూ, యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప ఆధ్యాత్మిక సంపద అని అన్నారు. యోగాభ్యాసం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందడంతో పాటు ఒత్తిడి, ఆందోళనలు తగ్గుతాయని పేర్కొన్నారు. ఆధునిక జీవనశైలిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా ఉత్తమ మార్గమని చెప్పారు.ఈ కార్యక్రమాల్లో భక్తులు, ఆలయ సిబ్బంది, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రధాన ముగింపు వేడుకను ప్రత్యేకంగా నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. ఆలయ సిబ్బంది, స్థానిక స్వచ్ఛంద సంస్థలు, పాఠశాల విద్యార్థులు, భక్తులతో కలిపి కనీసం 1,000 మంది ఏకకాలంలో యోగాసనాలు వేసేలా ప్రణాళిక రూపొందించామని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేపడుతున్నామని పత్రికాముఖంగా వెల్లడించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా ఎంతో దోహద పడుతుందని, ఈ రెండు వారాల యోగా ఉత్సవాలను విజయవంతం చేయడంలో అందరూ భాగస్వాములు కావాలని ఈవో కోరారు.

## బీజేపీ పదాధికారుల సమావేశం విజయవంతం



**ద్వారకాతిరుమల, జూన్ 7ప్రభాతవార్త** : ద్వారకాతిరుమల మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తిమ్మాపురం గ్రామంలో నిర్వహించిన పదాధికారుల సమావేశం విజయవంతంగా ముగిసింది. మండల ఉపాధ్యక్షుడు మెట్టపల్లి మాణిక్యాలరావు ఆధ్వర్యంలో, గోపాలపురం నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ ఆచంట సురేష్ సమక్షంలో ఈ సమావేశం జరిగింది.సమావేశంలో పార్టీ బలోపేతం, గ్రామస్థాయిలో సంస్థాగత విస్తరణ, రాబోయే కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. జిల్లా ఉపాధ్యక్షురాలు పాకలపాటి మంగతాయారు, ఏఎంసీ డైరెక్టర్ నిడమర్తి సత్యకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మరియు ట్రస్ట్ బోర్డు సభ్యుడు తాండ్ర సందీప్, జిల్లా ధార్మిక సెల్ కన్వీనర్ మైలు వాసుబాబు పాల్గొన్నారు.పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న వివిధ మోర్చాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశం ద్వారా మండలంలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు నాయకులు వెల్లడించారు.

## సోమవారం పీజీఆర్ఎస్ రద్దు



**భీమవరం జూన్ 7 ప్రభాతవార్త** జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీమతి చదలవాడ నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామంలో రేపు పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం మొత్తం పర్యటన ఏర్పాట్లలో నిమగ్నమై ఉండటంతో, జిల్లా, డివిజన్, మండల స్థాయిలలో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సంబంధిత కార్యాలయాలకు అర్జీల సమర్పణ కోసం రేపు రావద్దని, తదుపరి సోమవారం సాధారణంగా పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## 9న హనుమాన్ శోభాయాత్ర



**అత్తిలి, జూన్ 7 (ప్రభాతవార్త )** అత్తిలి హనుమాన్ శక్తి జాగరణ సమితి ఆధ్వర్యంలో ఈనెల 9న హనుమాన్ శోభాయాత్ర నిర్వహించినట్లు ర్వాహకులు తెలిపారు డిగ్రీ కళాశాల నుండి మధ్యాహ్నం నాలుగ వ భారీ పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్ఎస్ఎస్ ఆంధ్ర ప్రాంత ప్రచార ప్రముఖ్ భయ్యా వాసు, చిలకలూరిపేట ఆదిపరాశక్తి క్షేత్ర పీఠాధిపతి సత్య ద్యానంద భారతి స్వామి ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈశోభాయాత్ర లో పాల్గొనాల్సిందిగా తణుకు శాసన సభ్యుడు ఆరిమిల్లి రాధాకృష్ణ ను ఆహ్వానించినట్లు శక్తి జాగరణ సమితి వారు తెలిపారు.

## ఈ నెల 8 నుండి 12 వరకు ఎఫ్‌డిపి!




**భీమవరం జూన్ 7 ప్రభాతవార్త** ఈనెల 8వ తేదీ నుండి 12వ తేదీ వరకు ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఐటీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఫ్రంట్ ఇయర్స్ ఇన్ ఎడ్ టెక్: వాట్స్ నెక్స్ట్? అనే అంశంపై ఎఫ్ డి పి జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణం రాజు చెప్పారు. ఇందుకు సంబంధించిన పోస్టర్ను మంగళవారం ప్రిన్సిపల్ ఛాంబర్ లో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐటీ డిపార్ట్మెంట్ హెడ్ డాక్టర్ పి రవి కిరణ్ వర్మ, ఎఫ్ డి పి కోఆర్డినేటర్ డాక్టర్ పి శ్యామలరావు మాట్లాడుతూ టీచింగ్ లో ఇన్నోవేటివ్ ఆలోచనలతోనూ నూతన టెక్నాలజీస్, ఆర్ అండ్ డి లో వస్తున్న ఫలితాలను అన్వయించి టీచింగ్ లో మరిన్ని నూతన అంశాలు కలిపి బోధించేందుకు ఈ ఎఫ్ డి పి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. జేఎన్టీయూకే సిఎస్సి డిపార్ట్మెంట్ తో కలిసి ఎస్ ఆర్ కే ఆర్ , ఐ టి డిపార్ట్మెంట్ సంయుక్తంగా ఈ ఎఫ్ డి పి నిర్వహిస్తుందని్కొన్నారు. ఆఫ్ లైన్ లో జరిగే ఎఫ్ డి పి కి కళాశాల ఐటీ డిపార్ట్మెంట్ నుండి పలువురు విద్యారంగం, ఇండస్ట్రీ నిపుణులు నూతన అంశాలపైారన్నారు. ఇంజనీరింగ్ లో అన్ని విభాగాలకు చెందిన అధ్యాపక బృందం ఈ ఆఫ్ లైన్ ఎఫ్ డి పి లో పాల్గొన వచ్చని పేర్కొన్నారు. ఇతర కళాశాల అధ్యాపకులకు కూడా ఇందులో అవకాశం ఉంటుందన్నారు. జేఎన్టీయూకే సిఎస్సి ప్రొఫెసర్ డాక్టర్ ఏ ఎస్ ఎన్ చక్రవర్తి కూడా కోఆర్డినేటర్గా వ్యవహరిస్తున్నారన్నారు.

## సామాజిక సమస్యలపై అవగాహనకి పల్లెనిద్ర




**ఆగిరిపల్లి జూన్ 7 ప్రభాతవార్త** ఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్ సిబ్బందితో కలిసి ఆగిరిపల్లి మండలం మల్లెబోయిన పల్లె గ్రామములో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ శుభ శేఖర్ మల్లెబోయిన పల్లె గ్రామ ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై, సామాజిక సమస్యలపై అవగా హన కల్పించారు.ముఖ్యంగా గంజాయి, మత్తు పదార్థాల వాడకంపై తీవ్ర హెచ్చరికలు జారీ చేయడం జరిగింది. గంజాయి విక్రయించే వారిపై సమాచారం ఉన్నట్లయితే తక్షణమే పోలీసులకు లేదా డయల్ 112 కు సమా చారం అందించాలని సూచించారు.అదేవిధంగా, ఇంటి దొంగతనాల నివారణ కు ప్రతి ఇంట్లో సీసీ కెమెరాలు అమర్చు కోవాలని, వాటి వలన నేరాలను అరికట్టడం లో కలిగే ప్రయోజనాల ను ప్రజలకు వివరించా రు.ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండి సైబర్ నేరాలకు గురి కాకుండా ఉండాలని,పల్లె నిద్ర కార్యక్రమాల ద్వారా ప్రజల మధ్య భద్రతపై విశ్వాసం పెంపొందించడమే లక్ష్యమని తెలియజేశారు.

## నాపై అసత్య ప్రచారం తగదు :కొవ్వూరి నాగేంద్ర రెడ్డి



**తాడేపల్లిగూడెం: జూన్ 6,(ప్రభాతవార్త)** మీడియాలో తనపై అసత్య ప్రచారం జరుగుతుందని, అసలు ఏమీ లేని విషయాన్ని జరిగినట్టుగా కొన్ని టీవీ ఛానళ్ళు అసత్య ప్రచారం చేయటం తగదని తాడేపల్లిగూడెం రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొవ్వూరి నాగేంద్ర రెడ్డి అన్నారు.కొన్ని టీవీ ఛానళ్ల లో తాను దొంగ నోట్లు కేసులో అరెస్టయినట్లుగా అసత్య ప్రచారం జరుగుతుందని,ఈ ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని ఆయన అన్నారు. స్థానిక పి అండ్ టి కాలనీలో రెడ్డి సంక్షేమ సంఘం సీనియర్ నాయకుడు మేడపాటి చెల్లారెడ్డి నివాసంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. తాడేపల్లిగూడెం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ మీడియా సమావేశంలో నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా తమ కుటుంబం గురించి తాడేపల్లిగూడెం ప్రజానీకానికి తెలుసని,అత్యంత నిజాయితీగా వ్యవహరించే తమపై ఇలాంటి అసత్య ప్రచారం జరగటం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తన సొంత పొలం అమ్మకం వ్యవహారంలో తాను కాకినాడ వెళ్లానని తెలిపారు. అసలు దీనికి ఏ మాత్రం సంబంధం లేని దొంగ నోట్ల వ్యవహారం ఎలా వచ్చిందో అర్థం కావడం లేదు అన్నారు. కాకినాడ పోలీసు అధికారులు పూర్తి వివరణ ఇచ్చారని అన్నారు. ఎవరో ఇచ్చిన ఫేక్ కాల్ నిమిత్తం పోలీసులు తాము దిగిన లాడ్జికి వచ్చారని, పూర్తి విచారణ అనంతరం ఎలాంటి చట్ట వ్యతిరేక వ్యవహారం జరగలేదని పోలీసులు మీడియాకు తెలియజేశారని అన్నారు. ఈ విషయంలో ఎలాంటి ప్రాథమిక సమాచారం కాని, ఆధారాలు కానీ లేకుండా రెండు మూడు చానళ్ల లో అసత్య ప్రచారం చేసి తనకు పరువు నష్టం కలిగించారాని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు మేడపాటి చెల్లారెడ్డి, ద్వారంపూడి వేణుగోపాల్ రెడ్డి, నల్లిమిల్లి గాంధీ రెడ్డి, నల్లిమిల్లి అంజిరెడ్డి,కొవ్వూరి లక్ష్మణ రెడ్డి తదితరులు మాట్లాడారు.

## బల్క్ వేస్ట్ జనరేటర్ యంత్రాన్ని ఏర్పాటు చేసుకోవాలి



**తాడేపల్లిగూడెం జూన్ 6 (ప్రభాకర్)** ఎన్.జి.టి మార్గదర్శకాల ప్రకారం రోజుకు 100 కిలోల కంటే ఎక్కువ తడి చెత్తను ఉత్పత్తి చేసే హోటల్, రెస్టారెంట్ నిర్వాహకులు తప్పనిసరిగా బల్క్ వేస్ట్ జనరేటర్ (బిఎంజి) యంత్రాన్ని ఏర్పాటు చేసుకుని అక్కడికక్కడే కంపోస్ట్ తయారు చేసుకోవాలని పురపాలక సంఘ కమిషనర్ ఏ.ఏసుబాబు ఆదేశించారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని ఎస్.బి.ఆర్ గ్రాండ్ హోటల్ ను ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన తనిఖీ చేశారు. ఎస్.బి.ఆర్ గ్రాండ్ హోటల్లో ఏర్పాటు చేసిన బిఎంజి పనితీరును పరిశీలించి, ఉత్పత్తి అవుతున్న కంపోస్ట్ నాణ్యతను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. హోటల్ యాజమాన్యంతో మాట్లాడి తడి చెత్తను నూరుశాతం అక్కడే ప్రాసెస్ చేయాలని, మిగిలిన చెత్తను మాత్రమే పురపాలక సంఘ వాహనాలకు ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ ఎన్.జి.టి మార్గదర్శకాల ప్రకారం 100 కిలోల కంటే ఎక్కువ తడి చెత్తను ఉత్పత్తి చేసే హోటల్స్, రెస్టారెంట్లు, మార్కెట్లు, క్యాంటీన్లు తప్పకుండా దీబౌ+ బల్క్ వేస్ట్ జనరేటర్ ను పెట్టుకోవాలని, ఇది పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. మున్సిపాలిటీపై కూడా భారం తగ్గుతుందని చెప్పారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం ద్వారా పట్టణంలోని ప్రతి బల్క్ వేస్ట్ జనరేటర్ను తనిఖీ చేస్తామని, నిబంధనలు పాటించని యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, శానిటేషన్ ఇన్స్పెక్టర్ లు, పర్యావరణ ఇంజనీర్, పారిశుధ్య, సచివాలయ సిబ్బంది, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

**వెన్నుపోటుకు రెండేళ్లు పేరిట వైసీపీ చేస్తున్న వ్యాఖ్యలపై**

## జనసేన నాయకులు ఆగ్రహం.



**పెంటపాడు, జూన్ 6, ( ప్రభాతవార్త)** వెన్నుపోటుకు రెండేళ్లు పేరిట వైసీపీ చేస్తున్న వ్యాఖ్యలపై జనసేన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పెంటపాడు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో విలేకరుల సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కట్టుబోయిన వెంకటలక్ష్మి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం బందిపోటు మాదిరిగా పంచాయతీ, ఎస్సీ ఎస్టీ నిధులను దారి మళ్లించిందని విమర్శించారు. నాటి పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగి రెండేళ్లు కావస్తుందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందు తీసుకెళ్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఏళ్ళ తరబడి నిర్మాణానికి నోచుకోని పడమరవిప్పర్రు రహదారికి ఎమ్మెల్యే శ్రీనివాస్ నిధులు మంజూరు చేసి నిర్మించారన్నారు. పీ4లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. వైసీపీ అధినేత జగన్ ను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఏకవచనంతో సంబోధించినట్లు వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ఒకరిపై నిందలు వేసే ముందు నాలుగు వేళ్ళు మన వైపు చూస్తాయనే విషయాన్ని గుర్తించాలన్నారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, పవన్ కళ్యాణ్ పై వ్యక్తిగత దూషణలు ఏమయ్యారని ప్రశ్నించారు. నాడు మీరు తవ్విన గ్రావెల్ తో రోడ్లు కూడా పూడ్చలేదని విమర్శించారు. జనసేన మండల అధ్యక్షుడు పుల్లా రవి మాట్లాడుతూ తుగ్లక్ పాలనను ఛీకొట్టి ప్రతిపక్ష హోదా సైతం లేకుండా చేశారన్నారు. రెండేళ్ళలోనే కూటమి ప్రభుత్వానికి మా మంచి ప్రభుత్వమని పేరు వచ్చిందన్నారు. తుగ్లక్ మాదిరిగా 175 నియోజకవర్గాల్లోని ఆ పార్టీ శ్రేణుల ప్రెస్ మీట్, కార్యక్రమాలు ఉన్నాయని దుయ్యబట్టారు. ఇంట్లో ఉన్న ప్రతీ పిల్లవానికి తల్లికి వందనం నిధులు జమ చేశారన్నారు. మూడు గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు వంటి పథకాలను ప్రవేశపెట్టారన్నారు. పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి వర్గాన్ని దేశంలోనే నెంబర్ వన్ గా నిరుపేందుకు కృషి చేస్తున్నారన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థలో చరిత్ర సృష్టించారన్నారు. 627 గిరిజన గ్రామాలకు రోడ్లు వేసిన ఘనత పవన్ కళ్యాణ్ కి దక్కుతుందన్నారు. గ్రామాల్లోని చెరువులను తవ్వి రైతులకు మట్టి సరఫరా చేస్తుంటే దాన్ని రాజకీయం చేయడం సరికాదన్నారు. సిమెంట్ రోడ్లపై కంకర వేసిన ప్రభుత్వం మీదని విమర్శించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పదవి బాధ్యతలు చేపట్టగానే నియోజవర్గ అభివృద్ధిపై దృష్టి సారించారన్నారు. జనసేన నాయకులు లక్ష్మణ రెడ్డి, దాసరి శ్రీనివాసరావు, కసిరెడ్డి మధులత, కాజులూరి దుర్గా మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలు



**ద్వారకాతిరుమల, జూన్ 7 ప్రభాతవార్త** : ద్వారకాతిరుమల శాఖా గ్రంథాలయంలో శు క్రవారం ఉదయం సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమం, బహుమతుల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ద్వారకాతిరుమల మండల ప్రధాన విద్యాధికారి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తక పఠనం అత్యంత అవసరమని, మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించి పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. గ్రంథాలయాలు విద్యార్థుల విజ్ఞాన వికాసానికి కీలక కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు.

ఏప్రిల్ 28 నుంచి జూన్ 6 వరకు 40 రోజులపాటు నిర్వహించిన సమ్మర్ క్యాంప్‌లో క్యారమ్స్, క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం, డిబేట్, నృత్యం, పేపర్ క్రాఫ్ట్ తదితర సృజనాత్మక, విజ్ఞాన-వినోద కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రామాయణం కేశవాచారి ఆర్థిక సహకారంతో సర్టిఫికెట్లు, మెడల్స్, బహుమతులు అందజేశారువివిధ పాఠశాలలకు చెందిన సుమారు 50 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎన్.సి.హెచ్. రామకృష్ణ, శ్రీను మాస్టర్, షబ్బీర్, రాజేశ్వరి పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన భాండగారాలు



**పెనుమంత్ర, జూన్-07, (ప్రభాతవార్త)** మండలంలోని మార్టేరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఏప్రిల్ 28 నుండి జూన్-06 వరకు జరిగిన వేసవి వైజ్ఞానిక శిబిరం ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా గ్రంథాలయ గ్రామ అభివృద్ధి కమిటి చైర్మన్ జి. గుడిమెట్ల రామారెడ్డి, విశ్రాంత తహసిల్దార్ చిర్ల సూర్యనారాయణ రెడ్డి, విశ్రాంత ఆంగ్ల అధ్యాపకురాలు పి. సువర్ణ గౌరి, మానవత జిల్లా కన్వీనర్ కోత్త సత్యనారాయణామూర్తి, రామకృషఢ సేవా సమితి సభ్యులు యల్.వి సూర్యనారాయణమూర్తి, వై. నాగ ప్రసాద్ మానస్వీ, పాల ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయంలో వేసవి శిబిరంలో జరిగిన పోటీలను, ప్రతి ఒక్కరు గ్రంథాలయాలయంలో విజ్ఞానం, వివేకాన్ని పెంచుతాయన్నారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ప్రతి ఒక్కరు తెలియజేసిన్నారు. గ్రంథ పాలకుడు పి. టి. శివ కుమార్ మాట్లాడుతూ పిల్లలందరు గ్రంధాలయాన్ని ఉపయేగించుకోని ప్రతి ఒక్కరు విజ్ఞాన వంతులుగా ఎదగలని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు యమ్.డి. కలీమ్, కె. వైష్ణవి, వి. హర్షిత, యస్. అమృత, పి. మంజుష రెడ్డి, యస్. రోజామణి, జి. తెజశ్రీ, జి. లోచన్, వి. యస్ యన్. సన్వీశ్రీ, యస్. గాయత్రీ తనీష పాల్గొన్నారు.

## ధ్యానంపై శిక్షణ



**అత్తిలి జూన్7( ప్రభాత వార్త )** ప్రతి సమస్యకు పరిష్కారం భగవద్గీతలో లభిస్తుందని కానూరు అగ్రహారం కు చెందిన పిరమిడ్ మాస్టర్ సిహెచ్ రాంబాబు అన్నారు. అత్తిలి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ధ్యానంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ధ్యానం ద్వారా రోగాలను దూరం చేయవచ్చునని తెలిపారు. శ్వాస ను గమనించడం ద్వారా ఏకాగ్రతను పెంపొందించుకుని మనస్సు ను నియంత్రించుకోవాలని అన్నారు. పిరమిడ్ సొసైటీ ప్రతినిధి దాసం వెంకట ప్రసాద్,కడలి మాణిక్యాలరావు, గాజులు గణేష్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాంబాబు ను నిర్వాహకులు సత్కరించారు.

## కొండల రాయుడుకు షష్టి అభిషేకాలు

**కామవరపుకోటలో రూ.975కు చేరిన గ్యాస్ ధర..**

**సామాన్యుడిపై అదనపు భారం!**



**కామవరపుకోట, జూన్ 7 (ప్రభాతవార్త)**: నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇప్పటికే సతమతమవుతున్న సామాన్య, మధ్యతరగతి వినియోగదారులపై వంటగ్యాస్ భారం మరోసారి పడింది. అంతర్జాతీయ మార్కెట్ హెచ్చుతగ్గుల ఆధారంగా చమురు సంస్థలు గృహ అవసరాలకు వినియోగించే 14.2 కేజీల డొమెస్టిక్ ఎల్పీజీ సిలిండర్ ధరను భారీగా పెంచాయి. తాజా నిర్ణయంతో ప్రతి సిలిండర్‌పై ఒకేసారి రూ.29 మేర అదనపు భారం పడింది. సవరించిన ధరలు ఆదివారం నుంచే అమల్లోకి వచ్చినట్లు ఆయిల్ కంపెనీలు ప్రకటించాయి.తాజా పెంపుతో కామవరపుకోట మండలంలో ఇప్పటివరకు రూ.946గా ఉన్న డొమెస్టిక్ సిలిండర్ అధికారిక ధర, ఇప్పుడు ఏకంగా రూ.975కు చేరింది. కేవలం మూడు నెలల స్వల్ప వ్యవధిలోనే డొమెస్టిక్ సిలిండర్ ధర పెరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం. ఇలా వరుసగా గ్యాస్ ధరలు పెరుగుతుండడం పట్ల సామాన్య గృహిణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్తిలి, జూన్ 7( ప్రభాత వార్త )అత్తిలి లో గంటా వారి పుంతలో గల కొండలరాయుడు ఆలయం లో నెల షష్టి తిథి సందర్భంగా పంచామృతాలు, పండ్లరసాలు, సుగంధ ద్రవ్యాలు తో అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల వెంకట సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## వరాల వెంకన్న దర్శించుకున్న కనుమూరి



**అత్తిలి,జూన్ 7(ప్రభాతవార్త )** అత్తిలి మండలం ఈడూరు గ్రామం లోని వరాల వెంకటేశ్వర స్వామి వారిని టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, అన్నపూర్ణ దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలో నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాలు, అన్నదానం కార్యక్రమాల పట్ల నిర్వాహకులను అభినందించారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని కలిగి ఉండాలని అన్నారు.తొలుత బాపిరాజు దంపతులకు ఆలయ కమిటీ వారు ఘన స్వాగతం పలికారు. ఆలయం లో ప్రత్యేక అర్చనలు జరిపారు.ఆలయ అర్చకుడు వాడపల్లి శేఖరాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సత్తి సుబ్బన్న రెడ్డిని పరామర్శించిన మానవత సభ్యులు



**పెనుమంత్ర, జూన్-07, (ప్రభాతవార్త)** మానవతా సభ్యుడు కిషోర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సత్తి సుబ్బన్న రెడ్డి తల్లి సత్యవేణి అకాల మరణానికి చింతిస్తూ శనివారం మండలంలోని మార్టేరు మానవత ఆత్మీయ సహకార కమిటీ సభ్యులు వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి మనోధైర్యం ప్రసాదించాలని వారి తల్లి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మానవతా సభ్యులు నివాళులు అర్పించారు. నివాళులర్పించిన వారిలో ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ చిర్ల శ్రీనివాసరెడ్డి (సిఎస్ఆర్,) జిల్లా కమిటీ కొత్త సత్యనారాయణమూర్తి, రీజనల్ చైర్మన్ బాణాల శ్రీనివాసరావు, పడాల జగన్నాథ్ రెడ్డి, చిర్ల సూర్యనారాయణ రెడ్డి, పడాల రామచంద్రారెడ్డి, అమృత వాక్కుల సత్యనారాయణ, సి విశ్వనాథం, అంబులెన్స్ డ్రైవర్ శ్రీను, విశ్రాంత ఆంగ్ల అధ్యాపకురాలు సువర్ణ గౌరీ, సైకిల్ షాప్ క్రిష్ణ రెడ్డి మొదలైన వారు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## కామవరపుకోటలో రూ.975కు చేరిన గ్యాస్ ధర.. సామాన్యుడిపై అదనపు భారం!



**కామవరపుకోట, జూన్ 7 (ప్రభాతవార్త)**: నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇప్పటికే సతమత మవుతున్న సామాన్య, మధ్యతరగతి వినియోగదారులపై వంటగ్యాస్ భారం మరోసారి పడింది. అంతర్జాతీయ మార్కెట్ హెచ్చుతగ్గుల ఆధారంగా చమురు సంస్థలు గృహ అవసరాలకు వినియోగించే 14.2 కేజీల డొమెస్టిక్ ఎల్పీజీ సిలిండర్ ధరను భారీగా పెంచాయి. తాజా నిర్ణయంతో ప్రతి సిలిండర్‌పై ఒకేసారి రూ.29 మేర అదనపు భారం పడింది. సవరించిన ధరలు ఆదివారం నుంచే అమల్లోకి వచ్చినట్లు ఆయిల్ కంపెనీలు ప్రకటించాయి.తాజా పెంపుతో కామవరపుకోట మండలంలో ఇప్పటివరకు రూ.946గా ఉన్న డొమెస్టిక్ సిలిండర్ అధికారిక ధర, ఇప్పుడు ఏకంగా రూ.975కు చేరింది. కేవలం మూడు నెలల స్వల్ప వ్యవధిలోనే డొమెస్టిక్ సిలిండర్ ధర పెరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం. ఇలా వరుసగా గ్యాస్ ధరలు పెరుగుతుండడం పట్ల సామాన్య గృహిణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## గణపవరం లైన్స్ క్లబ్ నూతన కార్యవర్గం

**అత్తిలి/ గణపవరం జూన్ 7( ప్రభాత వార్త )**గణపవరం లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా పి . శ్రీరామమూర్తి, క్లబ్ కార్యదర్శి గా కెవిఎన్ . విశారద,కోశాధికారిగా ఎం ఎల్ ఎస్ ఎస్ . నారాయణ,కోఆర్డినేటర్ గా వి . నరేష్ కుమార్,మొదటి వైస్ ప్రెసిడెంట్గా .కే .నాగ శేషా రావు, 2వ వైస్ ప్రెసిడెంట్ గా ఎస్ . వెంకటేశ్వర రావు, క్లబ్ అడ్మినిస్ట్రేషన్ గా కే ఎస్ ఎన్ మూర్తి, క్లబ్ మెంబర్ షిప్ ఛైర్పర్సన్ గా కిలారి రవిబాబు, క్లబ్ సర్వీస్ చైర్ పర్సన్ గా పి సత్యనారాయణ మూర్తి, క్లబ్ మార్కెటింగ్ ఛైర్పర్సన్ గా బి . మాల్యాద్రి ఎన్నికయ్యారు.డైరెక్టర్స్ గా పెరుమాళ్ళ వెంకట రామ కృష్ణారావు, కే ఏ ఆర్ వెంకటేశ్వర్లు, కొనిశెట్టి గణేష్,వంకాయల వెంకటేశ్వరరావు,నారాయణ రవి,నారాయణ సురేష్,వంకాయల ఎన్ వి కృష్ణారావు ఎన్నికయ్యారు.

## నేడు మంత్రి పార్థసారధి రాక



**చాట్రాయి, జూన్ 7 ప్రభాతవార్త** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు మండలాల వారిగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నందున ఈ కార్యక్రమానికి రాష్ట్ర గృహ నిర్మాణం మరియు సమాచార శాఖ మాత్యులు కొలుసు పార్థసారథి మరియు పార్టీ పరిశీలకులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి విచ్చేస్తున్నట్లు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు చెప్పారు. సోమవారం ఉదయం చాట్రాయి మండలం, జనార్ధనవరం తుమ్మ గూడెం గ్రామాల మధ్యలో గల మామిడి తోటలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు బూత్ ఇంచార్జీలు, యూనిట్ ఇంచార్జీలు, క్లస్టర్ ఇంచార్జీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, బీఎల్ఏలు మరియు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అయన కోరారు.

## మొగల్తూరులో స్కూల్ బస్సు డ్రైవర్ అదృశ్యం

**మొగల్తూరు జూన్ 7 (ప్రభాతవార్త)**: పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం నార్త్ గ్రామం తెన్నేటివారి పేటకు చెందిన స్కూల్ బస్సు డ్రైవర్ తెన్నేటి ప్రదీప్ (25) అదృశ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ మేరకు మొగల్తూరు ఎస్సై కె. నాగేశ్వరరావు వివరాలు వెల్లడించారు.పోలీసుల కథనం ప్రకారం, ప్రదీప్ నరసాపురంలోని నారాయణ స్కూల్లో బస్సు డ్రైవర్గా విధులు నిర్వహిస్తున్నాడు. ఎనిమిది నెలల క్రితమే అతనికి వివాహం జరిగింది. శనివారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో పాఠశాలకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరిన ప్రదీప్ తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు, బంధువులు పలుచోట్ల గాలించినప్పటికీ అతని ఆచూకీ లభించలేదు. అనంతరం ప్రదీప్ సోదరుడు తెన్నేటి ప్రవీణ్ ఆదివారం మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు మ్యాన్ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారుఅదృశ్యమైన ప్రదీప్ ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్ లేదా మొగల్తూరు పోలీసులను సంప్రదించాలని ఎస్సై కె. నాగేశ్వరరావు కోరారు.

# పచ్చని పొలాల్లో.. అక్రమ తవ్వకాలు

## చక్రం తిప్పుతున్న కలిదిండికి చెందిన నామినేటెడ్ పదవి పొందిన డైరెక్టర్



**ముదినేపల్లి . జూన్ 7( ప్రభాత వార్త).** అనుమతులు లేకుండా చేపలు, రొయ్యల చెరువులను ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. పచ్చని పొలాలు మధ్య ఆక్వా సాగుతో పంటలు నాశనమవుతున్నాయ ని, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని రైతులు వాపోతున్నారు. అక్రమ చెరువులు కావడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి కడుతోంది. ముదినేపల్లి మండలం చేవూరులో సుమారు 60 ఎకరాల్లో భారీగా చెరువు తవ్వకాలు చేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా చెరువులు తవ్వుతుడటంతో దరఖాస్తుతో పాటు చెలించే రుసుము, పన్నుల రూపంలో రావాల్సిన ఆదాయం ప్రభుత్వానికి జమ కావడం లేదు. పంట సాగుకన్నా చేపలు, రొయ్యల చెరువుల ద్వారా అధిక దాయం లభిస్తుండడంతో పొలాలను చెరువుగా, మార్చేస్తున్నారు.రూపుమారుతున్న భూములు.. ఈ అక్రమ చెరువులతో భూముల స్వరూపం పూర్తిగా మారిపోతుంది. చెరువులకు నిర్ణీత దూరం వదలకుండా ప్రభుత్వ భూములు, ఇరిగేషన్ పోరంబోకు స్థలాలను సైతం కలిపేసి తవ్వేస్తున్నారు. దీనివల్ల పంట బోదెలు రహదారులను ఆనుకుని తవ్వుకోవాల్సి వస్తుంది. ఆ మట్టిన జడ్పీ రహదారిపై వేయడంతో కనీసం రాకపోకలకు అవకాశం లేకుండా పోయింది. దీనిపై నీటి సంఘం సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేసినా, స్థానికులు అభ్యంతరాలు చెప్పినా రెవెన్యూ, మత్స్య శాఖ అధికారులు కళ్లుమూసుకుని ముడుపుల మత్తులో జోగుతున్నారు.కలిదిండి నుంచి వచ్చి ముదినేపల్లిలో చక్రం తిప్పుతూ..కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవి పొందిన ఓ డైరకర్ ముదినేపల్లి మండలంలో జరుగుతున్న చెరువుల తవ్వకాల్లో చక్రం తిప్పడం గమనార్హం. దీంతో ఇక్కడి ' కూటమి నాయకులు గరంగరంగా ఉన్నారు. సదరు నాయకుడు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేరు చెప్పి ఈ అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నట్లు కూటమి నాయకులే బహిరంగంగా విమర్శిస్తున్నారు. అనుమతులు లేకున్నా ఎమ్మెల్యే పేరుతో అధికారులను బెదిరించి తవ్వకాలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికోసం రూ. లక్షల్లో ముడుపులు చేతులు మారినట్లు తెలుస్తుంది. 'సదరు నామినేటెడ్ పదవి ఇచ్చింది కేవలం సెటిల్మెంట్లు, అక్రమ చెరువు తవ్వకాల కోసమేనా' అని పలువురు ఆపార్టీ నాయకులే విమర్శిస్తున్నారు.మారని తీరు..అక్రమ చెరువు తవ్వకాల్లో ఎమ్మార్వో తీరులో మార్పురాకపోవడం గమనార్హం. చోటా మోటా నాయకులు పేరు చెప్పి ఈ అక్రమ తవ్వకాలకు పూర్తిగా ఆయన సహకరిస్తు భారీగా ముడుపులు తీసుకుంటున్నట్లు సమాచారం. ఇటీవల ఆయనపై పలువురు సీఎం పేషీ, విజిలెన్స్ వరకు ఫిర్యాదులు సైతం చేసిన విషయం విధితమే. అయితే అందులో పలువురు నాయకులను రాయబారులుగా పెట్టి ఆ ఫిర్యాదులు మీద ముందుకు వెళ్లకుండా రాజీ కుదుర్చుకున్నట్లు సమాచారం. ఈ అధికారి తీరుపై కూటమి నాయకులే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నారు.





## బంధన నరసింహస్వామి సేవలు ఆదర్శనీయం: రామరాజు

**మొగల్తూరు జూన్ 7(ప్రభాతవార్త)** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామ టిడిపి మాజీ అధ్యక్షుడు బంధన నరసింహస్వామి సేవలు సమాజానికి ఆదర్శనీయమని తెలుగుదేశం పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామాంజనేయరాజు (రామరాజు) అన్నారు. ఆదివారం నరసాపురం మండలం రుస్తుంబాద గ్రామంలోని లెప్రసి కాలనీలో బంధన నరసింహస్వామి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు బంధన విజయ్ కుమార్ ఆర్థిక సహకారంతో ఆరోగ్యవర్షిణి ట్రస్ట్ ఆధ్వర్యంలో కాలనీ వాసులకు దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రామరాజు చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ బంధన నరసింహస్వామి సమాజ సేవా దృక్పథాన్ని కొనియాడారు. అలాగే ఆయన కుమారుడు విజయ్ కుమార్ తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆరోగ్యవర్షిణి ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు సమాజంలోని నిరుపేదలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, మండల అధ్యక్షుడు వాతాడి ఉమా, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నక్కా ఆనంద్‌బాబు, ఆరోగ్యవర్షిణి ట్రస్ట్ చైర్మన్ నాగిడి రాంబాబు, ఎలమంచిలి విజయ్, 22వ వార్డు పట్టణ టీడీపీ అధ్యక్షుడు బమ్మిడి అప్పారావు, నరసాపురం నియోజకవర్గ దివ్యాంగుల అధ్యక్షుడు దొంగ శ్రీను, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు అడ్డాల కోటేశ్వరావు, దాసరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి రోజువారీగా నీటి సరఫరా

### పంచాయతీ సెక్రెటరీ పరమానందరావు వెల్లడి



**మొగల్తూరు జూన్ 7 (ప్రభాతవార్త)** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు పంచాయతీ గ్రామ ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా నేటి నుంచి ప్రతిరోజూ పంచాయతీ కుళాయిలు ద్వారా నీటి సరఫరా నిర్వహించనున్నట్లు పంచాయతీ సెక్రెటరీ పరమానందరావు తెలిపారు. గ్రామంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామంలోని అన్ని వార్డులకు సమానంగా నీటి సరఫరా అందేలా చర్యలు చేపట్టామని, ఎక్కడైనా నీటి సరఫరాలో అంతరాయం కలిగితే వెంటనే పంచాయతీ కార్యాలయానికి సమాచారం అందించాలని ప్రజలను కోరారు. నీటి వృథాను నివారిస్తూ ప్రతి కుటుంబం అవసరమైన మేరకే వినియోగించుకోవాలని సూచించారు. గ్రామ ప్రజలకు నిరంతర తాగునీటి సౌకర్యం కల్పించేందుకు పంచాయతీ యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ప్రజల సహకారంతో నీటి నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపడతామని పరమానందరావు తెలిపారు.

## శ్రీ బండి ముత్యాలమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



**మొగల్తూరు జూన్ 7 (ప్రభాతవార్త):** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలో 216 జాతీయ రహదారిని ఆనుకుని వెలసి ఉన్న ప్రసిద్ధ శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కృష్ణా, ఏలూరు తదితర జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు కొబ్బరికాయలు కొట్టి, మొక్కులు చెల్లించుకుని అమ్మవారి ఆశీస్సులు పొందారు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి ప్రత్యేక అర్చనలు చేయించారు.ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. తాగునీరు, క్యూలైన్లు, పార్కింగ్ సదుపాయాలను ఏర్పాటు చేయడంతో భక్తులు సౌకర్యవంతంగా దర్శనం చేసుకున్నారు. ఆలయ పరిసర ప్రాంతాలు భక్తులతో సందడిగా మారగా, అమ్మవారి దర్శనంతో తమ కోరికలు నెరవేరుతాయని భక్తులు విశ్వాసం వ్యక్తం చేశారు.

## రాజ్యసభ సభ్యులకు కొత్తపల్లి అభినందన





**నరసాపురం జూన్ 7 ప్రభాతవార్త** నూతనంగా ఎంపికైన టీడీపీ జనసేన రాజ్య సభ్యులు ను మాజీ మంత్రి కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు ఆదివారం కలిశారు.వారిని అభినందించారు. రమేష్ తదితరులును కలిసి వారికీ కేక్ తినిపించారు.రాష్ట్రంలోని పలు సమస్యల పరిష్కరినికీ వీరి ఎంపిక ఎంతో తోడ్పాటు వస్తోందన్నారు.

## పేకాట స్థావరం పై దాడి నలుగురు అరెస్ట్



**టి నర్సాపురం జూన్ 7 ప్రభాతవార్త** మండలంలోని బండివారి గూడెం గ్రామ శివారులో కొందరు వ్యక్తులు ఆదివారం సాయంత్రం పేకాట ఆడుతున్నారనే సమాచారంపై ఎస్.ఐ. జయబాబు సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడి నిర్వహించారు. ఈ దాడి సమయంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పట్టుకొని, వారి వద్ద నుండి రూ.4,000వేల నగదు మరియు రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి, వారిని అరెస్టు చేసి అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. మండలంలో ఎక్కడైనా జూదం, పేకాటవంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు నిర్వహించి నట్లయితే కఠిన చర్యలు తీసుకోబడతాయని ఎస్సై హెచ్చరించారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక




**జీలుగుమిల్లి, జూన్-07 (ప్రభాతవార్త)** మండలంలోని ములగలంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-01 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం ఘనంగా జరిగింది. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకేచోట కలుసుకున్న విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా పాల్గొన్న ఉపాధ్యాయులు మాట్లాడుతూ, తమ వద్ద విద్యనభ్యసించిన విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవడం గర్వకారణమన్నారు. పూర్వ విద్యార్థులతో గడిపిన రోజులను గుర్తుచేసుకుంటూ తమ అనుభవాలను పంచుకున్నారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, తమ జీవితాలకు ఈ పాఠశాలే బలమైన పునాది వేసిందని, గురువులు అందించిన విద్య, విలువలే తమ విజయాలకు కారణమని తెలిపారు. విద్యార్థి దశలోని మధుర జ్ఞాపకాలను స్మరించుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు.అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటుకున్నారు. తమను ప్రయోజకులుగా తీర్చిదిద్దిన పాఠశాలకు, గురువులకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏ.ఎస్. శర్మ, బెంజిమెన్, సోమశేఖర్, పరమానందం, రవికుమార్, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు ప్రసాదు తదితరులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్యాంకుకు వలవల నాని వన్నె తేవాలి

### సామాన్యుడి అవసరాలను తీర్చాలి : ఎమ్మెల్యే నాయకర్



**నరసాపురం జూన్ 7 ప్రభాతవార్త** నరసాపురం అర్బన్ బ్యాంక్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయం వద్ద అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భారీ బహిరంగ సభకు నరసాపురం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభా వేదికపై నూతన చైర్మన్ వలవలనాని డైరెక్టర్లు తుమ్మలపల్లి లక్ష్మీనారాయణ. సమతం వెంకటేశ్వరరావు కోరాడ పాపారావు ఎం వాసు ఎండి సలీం తదితరులతో ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ పార్టీ కోసం ప్రజల కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పి రామరాజు మాట్లాడుతూ స్థానిక ఎన్నికలకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన అన్నారు. అర్బన్ సొసైటీకి నూతన కమిటీ తగు న్యాయం చేయాలని ప్రజల అవసరాలను తీర్చాలన్నారు. బ్యాంకు ఆర్థిక వనరులను క్రమశిక్షణతో అభివృద్ధి చేయాలని కోరారు. మొగల్తూరు సొసైటీ అధ్యక్షులు నిప్పులేటి తారకరామారావు మాట్లాడారు. డిసిఎంఎస్ చైర్మన్ చాగంటి మురళి కృష్ణ చిన్న మాట్లాడుతూ సహకార రంగం అత్యంత క్లిష్టమైనది అన్నారు. ప్రతి అడుగు బ్యాంకు పురోభివృద్ధి వైపు వేయాలి అన్నారు. కొప్పాడా రవీంద్రనాథ్ ఠాగూర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో కూడా ఇ ళ్ళు పై రుణాలు ఇవ్వాలని కోరారు. కొత్తపల్లి జానకిరామ్ జక్కం శ్రీమన్నారాయణ కల్వకొలను తాతాజీ గుబ్బల నాగరాజు వాతాడి కనకరాజు గట్టెం శ్రీను పాలూరి బాబ్జి మైల వసంతరావు దొండపాటి స్వాములు తదితరులు మాట్లాడారు. అర్బన్ సొసైటీ కార్యదర్శి సిబ్బంది పాల్గొన్నారు. నూతన కమిటీ ప్రమాణస్వీకారం చేశారు.

## బీసీలకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు

### వైఎస్సార్‌సీపీ నేత చిప్పాడ నరసింహారావు



**జంగారెడ్డిగూడెం జూన్ 7 ప్రభాతవార్త** ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా నాయీ బ్రాహ్మణ విభాగ అధ్యక్షుడు చిప్పాడ నరసింహారావు (వెంకన్న) విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా, బీసీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో 50 సంవత్సరాలు పైబడిన బీసీలందరికీ పెన్షన్ ఇస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారని, కానీ అధికారంలోకి వచ్చాక ఆ మాటను పూర్తిగా గాలికొదిలేశారని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీని బీసీల పార్టీగా నమ్మి, తమను అన్ని విధాలా ఆదుకుంటారనే ఆశతో బీసీలంతా కూటమికి ఓట్లేసి గెలిపించారని గుర్తుచేశారు. అధికార పీఠం ఎక్కిన తర్వాత ఇచ్చిన మాటను విస్మరించి, కూటమి ప్రభుత్వం బీసీల వీపున వెన్నుపోటు పొడిచిందని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి, కాలయాపన చేయకుండా 50 ఏళ్లు పైబడిన బీసీలకు ఇస్తానన్న పెన్షన్ హామీని తక్షణమే అమలు చేసి తమ నిబద్ధతను చాటుకోవాలని డిమాండ్ చేశారు.

## నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలన, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి



**తాడేపల్లిగూడెం జూన్ 6 (ప్రభాతవార్త)** భారతదేశ ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగి రెడ్డి ఆదిలక్ష్మి సూచించారు. భాజపా పట్టణ కమిటీ సమావేశాన్ని స్థానిక కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి భోగి రెడ్డి ఆదిలక్ష్మి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ఈ నెల 21వ తేదీ వరకు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు. ప్రధానిగా భాధ్యతలు చేపట్టిన తరువాత ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా దేశ అభివృద్ధి కోసం పనిచేస్తున్న గొప్ప నేత నరేంద్ర మోదీ అని ప్రశంసించారు. బిజెపి జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నవీన్ జి బాధ్యతలు చేపట్టిన తర్వాత క్షేత్ర స్థాయి నుంచి కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారన్నారు. బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసి హాజరైన వారు తప్పనిసరిగా సరళ యాప్ లోని డిజిటల్ అటెండెన్స్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. బూత్ స్థాయి నుంచి మండల, పట్టణ స్థాయి వరకు కమిటీలను మరింత పటిష్టం చేసి సమన్వయంతో ముందుకు తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉందని వివరించారు. బిజెపి పట్టణ ఇన్చార్జి గున్నేపల్లి పుల్లాజీ మాట్లాడుతూ దేశ అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం అగ్రదేశాల సరసన నిలిచిందని కొనియాడారు. మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ రికార్డును అధిగమించి నరేంద్ర మోదీ ప్రభుత్వం కొనసాగుతుందని చెప్పారు. పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలను క్రమం తప్పకుండా సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీను మాట్లాడుతూ ఓటర్ల జాబితాల సమగ్ర సమీక్ష కార్యక్రమం పట్టణంలో త్వరలో ప్రారంభంకానుందని చెప్పారు. బూత్ స్థాయి ప్రతినిధులుగా నియమితులైన వారు తప్పనిసరిగా ఓటర్లను పరిశీలించి నిర్ధారించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇది ఎంతో ముఖ్యమైన కార్యక్రమమని అధికారులు, కూటమి పార్టీల ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ పని చేయాలన్నారు. నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలన సందర్భంగా కార్యక్రమాల నిర్వహణ ప్రతినిధులుగా నియమితులైన పాటే నాగేశ్వరరావు 12 కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. ఇమ్మంది బెనర్జీ మాట్లాడుతూ నరేంద్ర మోదీ 12 ఏళ్ల విజయవంతమైన పాలన సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాలకు అందరూ పాల్గొని విజయం చేయాలని వివరించారు. ఈ కార్యక్రమం లో బిజెపి నాయకులు, పదాధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహణ



**మొగల్తూరుజూన్ 7 (ప్రభాతవార్త):** కేంద్ర సహాయ మంత్రివర్యులు భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆదేశాల మేరకు పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం కొత్త శేరేపాలెం గ్రామంలోని శివాలయంలో ఆదివారం బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల అధ్యక్షులు కొల్లాటి చెన్నకేశవరావు అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమానికి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి, నరసాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట గంగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని, గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.అలాగే రానున్న కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి దాసరి బాబి, మండల ప్రధాన కార్యదర్శి బొరుసు శివ, జిల్లా కిసాన్ మోర్చా జనరల్ సెక్రటరీ పులపర్తి రమేష్ కుమార్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఆముదాలపల్లి వెంకటాచార్యులు, సాంబశివరావు, బంధన శ్రీను, కోపనాతి పెద్దరాజు గట్టెంమురళి , కొత్తపల్లి మురళి, పాతబత్తుల పెద్దిరాజు, బెల్లంకొండ గిరి, సోడం ఏడుకొండలు, కడలి శ్రీమన్నారాయణ, సాధనాల మణిబాబు సాధన మణిబాబుతదితరులు పాల్గొన్నారు.



నరసాపురం అర్బన్ బ్యాంకుకు నూతనంగా ఎన్నికైన చైర్మన్ వల వల నాని డైరెక్టర్లు, పాల్గొన్న ఎమ్మెల్యే నాయకర్

నరసాపురం ప్రభాతవార్త

## కల్తీ ఆహారం పై అవగాహన



**నరసాపురం జూన్ 7 ప్రభాత వార్త** ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం సందర్భంగా నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్యానెల్ లాయర్ నారిన శ్రీనివాసరావు , యలమంచిలి మండలం ఏనుగువాని లంక గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు కల్తీ ఆహార పదార్థాలు, కల్తీ పప్పుదినుసులు, కల్తీ బెల్లం తయారీ, అపరిశుభ్రమైన త్రాగు నీటిని తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను వివరించారు. ప్రభుత్వ ఆహార భద్రతా శాఖ విడుదల చేసిన నాణ్యత ఉన్న పదార్థాలు, నాణ్యత లేని పదార్థాలు ఎలా ఉంటాయో తెలియజేసే అంశాలు కలిగిన, కరపత్రాలు, పోస్టర్స్ ను గ్రామస్థులకు వివరిస్తూ వాటిని అందరికీ పంచారు. ఎవరైనా నాణ్యత లేని ఆహారపదార్థాలు గుర్తించినట్లయితే ఆహార భద్రత శాఖ టోల్ ఫ్రీ నంబరు 1800-11-2100 కి నేరుగా ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ప్రజల్లో అవగాహన కలిగేందుకు పోస్టర్లను, కరపత్రాలను ప్రభుత్వ కార్యాలయాలందు, పాఠశాలలయందు ఉంచడం జరిగిందన్నారు. తదనంతరం ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం ఫీల్డ్ ఆఫీసర్ పాల్గొన్నారు. ప్యానెల్ లాయర్ శ్రీనివాసరావు పాల్గొన్న వారందరికీ మజ్జిగ పంపిణీ చేశారు.

## ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల సువర్ణ పాలనలో అంతర్జాతీయ శక్తిగా భారతదేశం.

- **డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో ఆంధ్రప్రదేశ్‌లో శరవేగంగా అభివృద్ధి**
- **ఏపీ ప్రగతికి ప్రధాని మోదీ పెద్దపీట.. రాష్ట్రంలో పరుగు పెడుతున్న పారిశ్రామిక ప్రగతి.**
- **కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ**



**భీమవరం జూన్ 7 ప్రభాతవార్త** గత 12 ఏళ్ల సుదీర్ఘ అద్భుత పాలనలో దేశాన్ని సర్వతోముఖాభివృద్ధి పథంలో నడిపించడమే కాకుండా భారతదేశాన్ని ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశంగా నిలబెట్టిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకే దక్కుతుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. మోదీ 12 ఏళ్ల విజయవంతమైన పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా దేశంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఏపీ అభివృద్ధికి కేంద్రం అందించిన సహకారం పై భీమవరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు... ప్రపంచంలో ఎక్కడున్నా ప్రతి భారతీయుడు గర్వపడేలా మోదీ పాలన సాగిందని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ స్పష్టం చేశారు. దేశంలోని ప్రతి పేద కుటుంబానికి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నేరుగా చేరాయని వివరించారు. పేదల సంక్షేమమే పరమావధిగా యువత, మహిళలు, రైతుల అభ్యున్నతి కొరకు ఎన్నో చారిత్రాత్మక పథకాలను అమలు చేసిన ఘనత ఎన్ డి ఎ ప్రభుత్వానిదేనని అన్నారు. మోదీ పాలనలో భారతదేశ అంతర్జాతీయ సంబంధాలు మెరుగై, నేడు ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లినా ప్రధానికి లభిస్తున్న ఘన స్వాగతమే దానికి నిదర్శనమన్నారు. దేశ ప్రగతిని పరిశీలిస్తే 2014 మోదీ పాలనకు ముందు, 2014 తర్వాత అనే రీతిలో దేశ ముఖచిత్రం మారిపోయిందని ఆయన గణాంకాలతో సహా వివరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గత 12 ఏళ్లలో మోదీ ప్రభుత్వం అందించిన భారీ నిధులు, వివిధ సంక్షేమ, మౌలిక వసతుల కల్పన వివరాలను గణాంకాలతో వెల్లడించారు. గత రెండు సంవత్సరాలుగా కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉండటం వల్ల డబుల్ ఇంజిన్ అభివృద్ధి రాష్ట్రంలో శరవేగంగా జరుగుతుందన్నారు. ఏపీ అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ పూర్తి సహాయ సహకారాలు అందించడం వల్ల రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి పరుగు పెడుతోందని శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. ఉమ్మడి ఏపీ సగటు కేటాయింపు (రూ 886 కోట్లు) కంటే 11 రెట్లు ఎక్కువ అని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో రవాణా వేగాన్ని పెంచుతూ ప్రస్తుతం 8 వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళు నడుస్తున్నాయని అన్నారు. 2014 వరకు ఏపీలో కేవలం 4,190 కి.మీ గా ఉన్న జాతీయ రహదారులు, నేడు మోదీ ప్రభుత్వ హయాంలో 8,683 కి.మీ కి పెరిగాయని, హైదరాబాద్-విశాఖపట్నం, బెంగళూరు-చెన్నై, రాయ్‌పూర్-విశాఖపట్నం, చిత్తూరు-తచ్చూరు, బెంగళూరు-కడప-విజయవాడ అనే 5 భారీ గ్రీన్-ఫీల్డ్ కారిడార్ల ద్వారా రోడ్డు నెట్‌వర్క్ రూపాంతరం చెందింది. ప్రస్తుతం రాష్ట్రంలో రూ 92,649 కోట్ల విలువైన రహదారి పనులు జరుగుతున్నాయి. 2014లో దేశంలో కేవలం 842 వైద్య కళాశాలలు ఉండగా, గత 12 ఏళ్లలో అవి 2,100ం కి విస్తరించాయి అన్నారు. ఎయిమ్స్ (ఎ ఐ ఐ ఎం ఎస్ )ల సంఖ్య 8 నుండి 23కి పెరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ పరిధిలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఒక మంగళగిరి ఎయిమ్స్ (ఎ ఐ ఐ ఎం ఎస్ ), 7 ఈఎస్ఐ (ఈ ఎస్ ఐ సి ) ఆసుపత్రులు మరియు రికార్డు స్థాయిలో 17 కొత్త మెడికల్ కాలేజీలను మంజూరు చేసి ఏపీ ఆరోగ్య రంగాన్ని అగ్రభాగాన నిలిపింది అన్నారు. గత రెండేళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రంలో ఐదు సార్లు పర్యటించడం ఆయన ఆంధ్ర అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారటానికి నిదర్శనం అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రగతికి తలమానికమైన మెగా ప్రాజెక్టులకు మోదీ ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేసి సహకరిస్తుందని అన్నారు. రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ 23,988.68 కోట్లు విడుదల చేసి పనులను శరవేగంగా ముందుకు నడిపిస్తోంది అన్నారు. విభజన హామీ నెరవేరుస్తూ విశాఖపట్నం కేంద్రంగా మంజూరైన ఈ ప్రత్యేక రైల్వే జోన్ జూన్ 1 నుండి కార్యక్రమాలు ప్రారంభించింది అన్నారు. జనవరి 2025లో కేంద్ర ప్రభుత్వం రూ 11,440 కోట్ల భారీ పునరుద్ధరణ ప్యాకేజీ ఆమోదించి విశాఖ ఉక్కు మనుగడను సురక్షితం చేసిందని, ప్రత్యేక ప్యాకేజీ వల్ల స్టీల్ ప్లాంట్ లాభాల బాట పట్టిందని అన్నారు. కేంద్రం సహకారంతో ఏపీలోని నక్కపల్లిలో రూ 1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో 17.8 ఎం టి పి ఎ సామర్థ్యం గల ఎ ఎం /ఎన్ ఎస్ స్టీల్ ప్లాంట్ కు శంకుస్థాపన జరగటం, విశాఖపట్నంలో 15 బిలియన్ డాలర్ల (యూ ఎస్ డి ) భారీ పెట్టుబడితో గూగుల్ ఎ ఐ డేటా సెంటర్ ఏర్పాటు, రూ 4,592 కోట్లతో భోగాపురం గ్రీన్-ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం, రూ 95,000 కోట్లతో బీపీసీఎల్ గ్రీన్-ఫీల్డ్ రిఫైనరీ, రామాయపట్నం పోర్టుల నిర్మాణం వేగంగా సాగుతోందని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ వివరించారు.